ఒక్కేసి పువ్వేసి.. బతుకమ్మ ఆడేసి..

ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే: పోలీసు కుటుంబాల ఆధ్వర్యంలో పరేడ్ మైదానంలో బతుకమ్మ వేడుకలను బుధవారం నిర్వహించారు. సీపీ సునీల్‌దత్, నిషితశర్మ దంపతులు గౌరమ్మకు పూజలు చేశారు. మహిళా పోలీసులు పెద్దఎత్తున తరలిరావడంతో మైదానంలో కోలాహలం నెలకొంది. అదనపు డీసీపీలు నరేశ్‌కుమార్, ప్రసాద్‌రావు, ఏసీపీలు రవి, సాంబరాజు, నర్సయ్య, ఆర్‌ఐలు కామరాజు, శ్రీశైలం, సురేశ్, ఏఓ అక్తరున్నీసాబేగం, సీఐలు రాజిరెడ్డి, సతీశ్, ఉదయ్‌కుమార్, రమేశ్, రాజు పాల్గొన్నారు.

పాదం కలిపిన కలెక్టర్

ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే: సర్దార్ వల్లభ్‌భాయి పటేల్ క్రీడా మైదానంలో బుధవారం రాత్రి బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిరూపం బతుకమ్మ పండగ అని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు అందమైన బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో సందడి చేశారు. వీరికి కలెక్టర్ జత కలిశారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజ, శిక్షణ సహాయ కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్ఠ, డీఆర్ఓ సన్యాసయ్య, ఉద్యోగులు, మహిళలు పాల్గొన్నారు.




సతీమణి నిషితశర్మతో కలిసి బతుకమ్మను పూజిస్తున్న సీపీ సునీల్‌దత్.. పటేల్ స్టేడియంలో కలెక్టర్ ఆటపాటా

15న సీఎం కప్ ర్యాలీ

ఖమ్మం క్రీడలు: సీఎం కప్ క్రీడా అవగాహన ర్యాలీని ఖమ్మం నగరంలో మంగళవారం నిర్వహించనున్నట్లు డీవైఎస్ఓ సునీల్‌రెడ్డి తెలిపారు. ఖమ్మం స్టేడియంలో బుధవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. అదే రోజు నిర్వహించనున్న 10కె రన్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఒలింపిక్ సంఘం ప్రతినిధులు క్రిష్టఫర్ బాబు, పుట్టా శంకరయ్య, క్రీడా సంఘాల ప్రతినిధులు గోవింద రెడ్డి, పరిపూర్ణాచారి, షఫీ, ఉప్పల్‌రెడ్డి పాల్గొన్నారు.

సుడా కుర్చీకి పోటాపోటీ

ఈటీవీ, ఖమ్మం

స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) పాలకవర్గం ఎంపిక ప్రక్రియ దసరా నాటికీ కొలిక్కి వచ్చేలా కనిపించటం లేదు. ఛైర్మన్ గిరి రేసులో చాంతాడంత జాబితా ఉండటంతో సుడా కుర్చీ ఎవరికి కట్టబెట్టాలన్న అంశం ఇప్పుడు అధికార పార్టీకి తలనొప్పిగా మారింది. వాస్తవానికి విజయదశమి పండగ నాటికి పదవులు భర్తీ చేయాలనుకున్నప్పటికీ పోటీ తీవ్రంగా ఉండటంతో చర్చలు ఎడతెగటం లేదన్న వాదన వినిపిస్తోంది.



కొలిక్కిరాని కసరత్తు

రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయ కొలువుల జాతర కొనసాగుతోంది. ఇప్పటికే తొలిదఫా రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులు భర్తీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాల వారీగా పదవుల పందేరంపై ప్రత్యేక దృష్టి సారించింది. శాసనసభ ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషిచేసిన నాయకులకు ప్రాధాన్యమివ్వాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే రెండ్రోజుల క్రితం కొన్ని జిల్లాలకు గ్రంథాలయ సంస్థ ఛైర్మన్లను ప్రకటించింది. కొన్ని జిల్లాల్లో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలకు పాలకవర్గాలను నియమించింది. స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సుడా) పాలకవర్గం ఎంపికపై మూడు, నాలుగు నెలల నుంచే కసరత్తు జరుగుతున్నా ఆశావహులు ఎక్కువగా ఉండటంతో ఎటూ తేలటం లేదు. ప్రధానంగా ఖమ్మం కేంద్రంగా కార్యకలాపాలు సాగించే 'సుడా'కు పాలకవర్గం లేక దాదాపు తొమ్మిది నెలలవుతోంది. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇక్కడి నుంచే ప్రాతినిథ్యం వహిస్తున్నారు. వైరాతో పాటు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న మధిర, పాలేరు నియోజకవర్గాల్లోని వివిధ ప్రాంతాలు సుడా పరిధిలోకి వస్తుండటంతో ఛైర్మన్ గిరికి వీరి ఆమోదం కీలకంగా మారింది. అమాత్యులు వేర్వేరు పేర్లు సూచిస్తుండటంతో ఛైర్మన్ ఎంపిక ప్రక్రియ ఆలస్యమవుతుందనే వాదనలు వినిపిస్తున్నాయి.

ఆమాత్యుల ఆమోదమే కీలకం


గతంలో ఖమ్మం నియోజకవర్గానికి ఛైర్మన్ పదవి దక్కినందున ఈసారి మరో శాసనసభ స్థానం వారికి అవకాశమివ్వాలని పలువురు నేతలు పట్టుబడుతున్నారు. అయితే.. స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యకలాపాలన్నీ ఖమ్మం కేంద్రంగానే సాగుతుండటం, సుడా పరిధి ఎక్కువ ఖమ్మం నియోజకవర్గంలోనే ఉండటంతో ఇక్కడి నాయకులకే ఛైర్మన్ పదవి ఇవ్వాలనే వాదనను మరికొందరు వినిపిస్తున్నారు. డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కమర్తపు మురళి, ఎండీ జావెద్, సాధు రమేష్‌రెడ్డి, నాగండ్ల దీపక్‌చౌదరి, మిక్కిలినేని నరేందర్, వడ్డెబోయిన నర్సింహారావు, చావా నారాయణరావు, వడ్డే నారాయణరావు తదితరులు ఛైర్మన్ పదవిపై గంపెడాశలు పెట్టుకున్నారు. ఛైర్మన్, పదకొండు మంది డైరెక్టర్లతో పాలకమండలి ఏర్పాటుకు అవకాశముంది. దసరా పండగ నాటికి సుడా పాలకవర్గాన్ని ప్రభుత్వం ప్రకటిస్తుందని తొలుత భావించినా.. ఎంపిక ప్రక్రియ ఆలస్యమవుతుందని తాజా పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ఆశావహులు అధిక సంఖ్యలో పోటీపడుతుండటం, ముగ్గురు మంత్రులకు ఆమోదయోగ్యమైన వ్యక్తికి కుర్చీ కట్టబెట్టాల్సి రావటంతో జాప్యం జరుగుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఇలాగైతే.. ప్రతిరోజూ పండగే!

పండగ అంటే అయిన వారందరూ కలుసుకోవటం.. ఆనందాలను పంచుకోవటం.. గత స్మృతులను నెమరువేసుకోవటం.. పదికాలాల పాటు పదిలపరచుకునే మరిన్ని అనుబంధాలను మూటగట్టుకోవటం.. పండగ పూట ఇలాంటి మధురిమలు పొందాలంటే అందరూ కలిసి ఓ చక్కని ప్రణాళిక ఏర్పరచుకుంటే ఎంతో మేలు కదా..!

–అశ్వాపురం, న్యూస్‌టుడే

..ఇదిగో మణుగూరుకు చెందిన రామారావు కుటుంబం.. కుమారుడు, కోడలు సెలవుల్లో హైదరాబాద్ నుంచి వచ్చారు. మనుమలు, మనుమరాళ్లు కూడా ఉన్నారు. ఇల్లంతా ఒకటే సందడి. అందరూ సరదాగా మాట్లాడుకుంటున్నారు. పండగను సంతోషంగా గడపాలనుకున్నారు. అందుకు ప్రణాళికను రూపొందించుకుంటున్నారు. 'ఒకప్పుడు పండగలు ఎంతో సంతోషంగా గడిచేవి. క్రమేణా కళను కోల్పోతున్నాయి. అందరూ కలిసినా పిల్లలు, పెద్దలూ సెల్‌ఫోన్లు, కంప్యూటర్లతోనే గడుపుతున్నారు. ఎవరికివారే ఒంటరిగా ఉంటున్నారు. పండగ వచ్చిందంటే నేనూ, నా స్నేహితులందరం సరదాగా పచ్చని పొలాలు, చెరువు గట్ల వెంట తిరిగేవాళ్లం. ప్రకృతి అందాలను ఆస్వాదించేవాళ్లం. తోటల్లో హాయిగా చెట్ల కింద సేదతీరేవాళ్లం. పండగ పూట ఆరోజంతా ఆనందంగా గడిచిపోయేది..' రామారావు మాటలు పూర్తికాకుండానే మనుమడు, మనుమరాళ్లు ఉత్సుకతతో చుట్టుముట్టారు. 'తాతయ్యా.. మాకూ పంటపొలాలు, చెరువు గట్లు చూడాలనుంది. మమ్మల్ని తీసుకెళ్లరూ..?' అంటూ మారాం చేశారు. 'వీడియో గేమ్స్ బంద్. బోరింగ్. సెలవు రోజులన్నీ మీతోనే గడుపుతాం తాతయ్యా..' అంటూ పిల్లలు భీష్మించారు.



బంధుమిత్రులతో కులాసాగా కబుర్లు

కోడలు శ్రీలత మాట్లాడుతూ.. 'నిజమే మామయ్యా.. ఈ కాలంలో అయినవారితో మాటలు, యోగక్షేమాలు సెల్‌ఫోన్ల వరకే పరిమితమవుతున్నాయి. వ్యక్తిగతంగా వారిని కలవటం, ఆనందాలను పంచుకోవటం పూర్తిగా తగ్గిపోయింది. దసరా పండగ సెలవు రోజుల్లో గ్రామంలోని మన బంధుమిత్రులందరినీ కలుసుకుంటాను. వారితో ఆనందంగా గడుపుతాను' అని బదులిచ్చారు.

దినపత్రికలు, పుస్తక పఠనంతో జ్ఞాన సముపార్జన

కుమారుడు తరుణ్ జోక్యం చేసుకుంటూ 'పుస్తకాలు, దినపత్రికలు చదవటమూ తగ్గిపోయింది. ఎంతసేపూ సెల్‌ఫోన్లు, సామాజిక మాధ్యమాలు అంటూ వాటిని అనుసరించటానికే సరిపోతోంది. వాటివల్ల అవగాహన స్థాయి పెరగదు. అనుభూతీ కలగదు. జ్ఞాపకశక్తి పెంపొందదు. పైగా ఆరోగ్య సమస్యలు తలెత్తవచ్చు. అదే ఏదైనా ఓ మంచి పుస్తకం, దినపత్రిక చదివితే కలిగే ఆనందం వేరు. దినపత్రికల్లోనూ ఇటీవల చాలా మార్పులొస్తున్నాయి. సూటిగా, స్పష్టంగా తక్కువ వాక్యాల్లోనే కీలక విషయాలు, భావాలను అవి చెబుతున్నాయి. దినపత్రికలు, పుస్తక పఠనం వల్ల సమాజ పోకడ అవగతమవుతుంది. వివేకం పెంపొందుతుంది. ఈ సెలవు రోజులన్నీ సెల్‌ఫోన్‌ను పక్కనపెట్టి మీ అందరితో గడుపుతూ రోజూ దినపత్రిక చదివేందుకు కాసింత సమయం వెచ్చిస్తా.. ఓ మంచి పుస్తకం చదవాలనుకుంటున్నాను..'అని స్పష్టం చేశారు.

ఆచరిస్తే.. ఆనందాలే..



కుటుంబ సభ్యులందరూ కలిసి బుధవారం పిండివంటలు చేసుకున్నారు. పిల్లలు.. తాతయ్య వెంట పచ్చని పొలాలు, చెరువు గట్లను సందర్శించారు. పంటకాల్వల్లో కాగితం పడవలు వదిలి కేరింతలు కొట్టారు. పూల తోటల్లో విహరించారు. చెట్ల కింద ఆటలాడారు. ఆరుబయట వారికవన్నీ అదే తొలిసారి. కోడలు ఊళ్లోని బంధుమిత్రుల ఇళ్లకు వెళ్లారు. వారితో ఆనందంగా కబుర్లు చెప్పి అందరి ప్రేమాభిమానాలను చూరగొన్నారు. కుమారుడు అందరితో సంతోషంగా గడుపుతూనే పుస్తకం చదువుతున్నారు. చక్కని అనుభూతిని మిగుల్చుకుంటున్నారు. ఈసారి వారింట్లో మునుపెన్నడూ లేని రీతిలో పండగ ఆనందాలు వెల్లివిరుస్తున్నాయి..!

నేడు సద్దుల బతుకమ్మ



ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే: సద్దుల బతుకమ్మ వేడుకలను గురువారం జరుపుకోనున్నారు. అమ్మవారికి ఐదు రకాల నైవేద్యాలు సమర్పిస్తారు. బతుకమ్మ ఉత్సవాల్లో చివరిరోజు కావడంతో 'పోయిరా బతుకమ్మ.. మళ్చొచ్చే ఏడాది తిరిగి రావమ్మ' అంటూ మహిళలు వీడ్కోలు పలుకుతారు. ఖమ్మం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మున్నేరు కాల్వొడ్డు వంతెన వద్ద సద్దుల బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసు బందోబస్తు నిర్వహించనున్నారు.

11న సమీకృత గురుకుల పాఠశాలలకు శంకుస్థాపన

రఘునాథపాలెం, న్యూస్‌టుడే: రఘునాథపాలెం వద్ద సమీకృత గురుకుల పాఠశాలల సముదాయాన్ని నిర్మించనున్నారు. స్థానిక జింకలతండా సమీపంలో రఘునాథపాలెం సర్వే నంబర్-30లో 23 ఎకరాలకు పైగా గురుకులాల కోసం భూమిని కేటాయించారు. ఇందులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగులు, ఈబీసీ గురుకులాలను నిర్మించనున్నారు. ఈ సముదాయం నిర్మాణానికి ఈనెల 11న శంకుస్థాపన జరుగనుంది. ఈ నేపథ్యంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ విడివిడిగా సదరు స్థలాన్ని బుధవారం సందర్శించారు. పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.



జింకలతండా వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పొన్నెకల్లు వద్ద నిర్మించనున్న సమీకృత గురుకుల విద్యాలయ సముదాయ ప్రాంతాన్ని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ బుధవారం పరిశీలించారు. భవన నిర్మాణానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం శంకుస్థాపన చేయనున్నారు. పర్యటన నేపథ్యంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై చర్చించి అధికారులకు కలెక్టర్ సూచనలు చేశారు. కార్యక్రమానికి వచ్చే ప్రజలకు అసౌకర్యం తలెత్తకుండా ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. శిక్షణ కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్ఠ, రహదారులు భవనాల శాఖ ఎస్ఈ హేమలత, డీఈవో సోమశేఖరశర్మ పాల్గొన్నారు.

డంపింగ్ యార్డుకు ప్రణాళికలు రూపొందించాలి

ఖమ్మం కమాన్‌బజార్: ఖమ్మం ఒకటో డివిజన్ డంపింగ్ యార్డు చెత్త డిస్పోజల్‌కు ప్రణాళికలు రూపొందించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఒకటో డివిజన్‌లో డంపింగ్ యార్డు అప్రోచ్ సీసీ రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఘన వ్యర్థాల నిర్వహణ ప్లాంట్ ఏర్పాటు వివరాలను అడిగి తెలుసుకున్నారు. డంపింగ్ అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎంపీ రఘురాంరెడ్డి, ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మువ్వా విజయబాబు, ఆర్డీవో గణేష్, కార్పొరేటర్ తేజావత్ హుస్సేన్ పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు స్థలం పరిశీలించండి: పొంగులేటి

కల్లూరు, న్యూస్‌టుడే: సమీకృత గురుకులాల సముదాయానికి సత్తుపల్లి నియోజకవర్గంలో 25 ఎకరాల స్థలాన్ని ఎమ్మెల్యే మట్టా రాగమయితో కలిసి పరిశీలించాలని కల్లూరు ఆర్డీవో రాజేందర్‌ను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. నారాయణపురంలో అధికారులతో బుధవారం సమావేశమయ్యారు. ధరణిలో ఎక్కువ సమస్యలు, అతి పెద్ద సర్వే నంబర్లు(ఒకే సర్వే నంబర్‌లో రెండు వేలకు పైగా) ఉన్న రెండు గ్రామాలను నియోజకవర్గంలో ఎంపిక చేసి వాటి సమస్యల పరిష్కారాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకోవాలని సూచించారు. ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మువ్వా విజయబాబు, మట్టా దయానంద్ పాల్గొన్నారు. దేవీ నవరాత్రుల సందర్భంగా నారాయణపురంలోని రామాలయంలో మంత్రి పూజలు నిర్వహించారు. బీరప్ప దేవాలయానికి రూ.2లక్షల విరాళాన్ని అందజేశారు. కల్లూరు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన నవరాత్రి ఉత్సవాలకు హాజరై పూజలు చేశారు. నారాయణపురంలో బుధవారం ఉదయం పొలంబాట పట్టారు. పొలాల గట్ల వెంబడి పర్యటిస్తూ ప్రకృతి రమణీయతను ఆస్వాదించారు.



నారాయణపురంలో వరి పొలాలను పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు: తుమ్మల

రఘునాథపాలెం, న్యూస్‌టుడే: ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. మంగ్యాతండా, కేవీబంజర, మూలగూడెంలో అంతర్గత సీసీ రోడ్లు, మురుగు కాల్వలకు బుధవారం శంకుస్థాపన చేశారు. గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, సాధు రమేశ్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు తాతా రఘురాం పాల్గొన్నారు.



గ్రామస్థులతో మాట్లాడుతున్న తుమ్మల

ఖమ్మం కమాన్‌బజార్: విద్యా గుమ్మం ఖమ్మం జిల్లా అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్‌తో మంత్రి సమావేశమయ్యారు. నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల కాంప్లెక్స్ శంకుస్థాపనకు సర్వం సిద్ధం చేయాలని ఆదేశించారు. ఖమ్మం నియోజకవర్గంలో 50 మసీదులకు రూ.50 లక్షలు కేటాయించాలని, అక్షయపాత్రకు భూమిని గుర్తించాలని మంత్రి ఆదేశించారు. జిల్లాలో మైనింగ్, గంజాయి అక్రమాలపై ఉక్కుపాదం మోపాలని సీపీకి సూచించారు. ఖమ్మం నగరంలోని ప్రకాశ్‌నగర్, రఘునాథపాలెం చింతగుర్తి, గణేశ్వరం, చెర్వుకొమ్ముతండా, వేపకుంట్లలో అభివృద్ధి పనులను మంత్రి గురువారం ప్రారంభించనున్నారు.

మిల్లుల్లో ధాన్యం మాయంపై విచారణ పూర్తి

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: జిల్లాలో పలు మిల్లుల నిర్వాహకులు సీఎంఆర్(కస్టం మిల్లింగ్) బియ్యం ప్రభుత్వానికి అప్పగించకుండా ధాన్యం పక్కదారి పట్టించిన అంశంపై విచారణ జరిపి కలెక్టర్‌కు నివేదిక సమర్పించినట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పాడిశెట్టి శ్రీజ బుధవారం తెలిపారు. ధాన్యం మరపట్టి బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించాల్సిన బాధ్యత మిల్లర్లపై ఉందన్నారు. చట్ట ప్రకారం బాధ్యులపై త్వరలో చర్యలు తీసుకుంటారని, సంబంధిత మిల్లర్లపై రెవెన్యూ రికవరీ యాక్ట్ అమలుచేస్తామని తెలిపారు. విధుల్లో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రుల నుంచి నియామక పత్రాలు అందుకుంటున్న కొత్త ఉపాధ్యాయులు లక్కం స్వాతి(పాలేరు), భూక్య ఉష(మధిర).


ఎమ్మార్పీఎస్ శ్రేణుల నిరసన

ఖానాపురం హవేలి: డీఎస్సీ ఉద్యోగ నియామకాల్లో ఎస్సీ వర్గీకరణ చేయకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా వ్యవహరిస్తూ మాదిగలకు అన్యాయం చేశాడంటూ ఖమ్మంలో ఎమ్మార్పీఎస్ శ్రేణులు బువారం నిరసన తెలిపాయి. సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన రోజు అసెంబ్లీలో ముఖ్యమంత్రి ఆర్డినెన్స్ తీసుకువచ్చి వర్గీకరణ అమలు చేస్తామని ప్రకటించి ఇప్పుడు మాదిగలను మోసగించారని ఎమ్మార్పీఎస్ నాయకులు ఆరోపించారు. ఆర్డినెన్స్ ద్వారా వర్గీకరణ అమలుచేసి ఉద్యోగ నియామకాలు చేపట్టాలని కోరారు. ప్రదర్శన అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం సమర్పించారు. ఏపూరి వెంకటేశ్వరరావు మాదిగ, బచ్చలకూర వెంకటేశ్వర్లు, కూరపాటి సునీల్, తూరుగంటి అంజయ్య తదితరులు పాల్గొన్నారు. హైదరాబాద్‌లో మందకృష్ణ మాదిగను అరెస్టు చేసినందుకు నిరసన కలెక్టరేట్ ఎదుట సీఎం దిష్టిబొమ్మ దహనం చేశారు.



జడ్పీ కూడలిలో నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నర్సరీలపై.. ఏదీ నజర్?




టేకులపల్లి, న్యూస్‌టుడే

● ఆళ్లపల్లి మండలానికి చెందిన గొగ్గెల పాపారావు టేకులపల్లిలోని ఓ నర్సరీలో 2 వేల మిరప మొక్కల్ని కొనుగోలు చేశారు. బిల్లు ఇవ్వాలని కోరగా అందుకు నిర్వాహకుడు నిరాకరించాడు.

● టేకులపల్లి మండలం బద్దుతండాకు చెందిన బాలు.. వర్షాలకు ముందు మిరప మొక్కలు నాటారు. వర్షాలతో చాలా మొక్కలు చనిపోవడంతో ఇటీవల మరో 2వేల మొక్కలు కొనేందుకు టేకులపల్లిలోని ఓ నర్సరీని సంప్రదించాడు. కనీసం అది ఏరకమో కూడా చెప్పలేదని రైతు వాపోయారు.

● ఇల్లెందు మండలం మాణిక్యారానికి చెందిన రైతు రమేశ్.. ఇల్లెందు మండలంలోని ఓ నర్సరీలో మొక్కలు కొన్నారు. బ్రాండ్ పేరైతే చెప్పారని, రశీదు అడిగితే ఇచ్చేది లేదన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.



ఉభయ జిల్లాల్లో మిరప నారు, కూరగాయల మొక్కలను పెంచే నర్సరీలపై నజర్ కొరవడింది. కొందరు నిబంధనలు పాటించటం లేదు. లాభాలే ధ్యేయంగా ఈ ఏడాది నర్సరీలను పెద్దఎత్తున ప్రారంభించారు. కొన్నిచోట్ల కనీసం రశీదులూ ఇవ్వని పరిస్థితి. ఇకనైనా దృష్టిసారించాలని వ్యవసాయశాఖ అధికారులను రైతులు కోరుతున్నారు.

ఖమ్మం జిల్లాలో 247, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 33 నర్సరీలను అనుమతితో నిర్వహిస్తున్నారు. వీటిల్లో ఇటీవల ఎక్కువగా మిరప నారు పెంచారు. వర్షాల నేపథ్యంలో కొన్నిచోట్ల తోటలు దెబ్బతినడం, కొందరు రైతులు మళ్లీ నాటుతుండటంతో ప్రస్తుతం మిరప మొక్కలకు గిరాకీ బాగా పెరిగింది. ఈ క్రమంలో పంట దిగుబడులను దృష్టిలో పెట్టుకొని రైతులు విత్తనాల వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. కానీ, నిర్వాహకుల నుంచి నిర్లక్ష్య సమాధానమే ఎదురవుతోంది. 'అది ఏ రకం విత్తనం? కంపెనీ పేరేమిటి? లాట్ నంబరు ఎంత? ఆ వివరాలతో బిల్లు కావాలి' అని అడిగితే పెదవి విరుస్తున్నారు. బిల్లు ఇచ్చేది లేదని, ఇష్టం లేకుంటే వెళ్లిపోవాలని తేల్చిచెబుతున్నారు. దాదాపు చాలాచోట్ల ఇదే పరిస్థితి ఎదురవుతుండటంతో చేసేదేమీ లేక నారు కొనుగోలు చేస్తున్నారు.

నిబంధనలు ఇవీ..

- విత్తన కంపెనీ, లాట్, బ్యాచ్ నంబరు, తయారీ తేదీ, గడువు తేదీ తప్పనిసరిగా నారు పెంచే బెడ్ల ముందు రాసిపెట్టాలి.
- నారు విక్రయించిన తేదీ, పూర్తి వివరాలను రికార్డుల్లో పొందుపరచాలి.
- నర్సరీలో లభించే నార్లు, ఆయా రకాల మొక్కల సంఖ్య, ధరల వివరాల తెలుగు పట్టికను ప్రధాన ద్వారం వద్ద ప్రదర్శించాలి.
- పేరున్న, నాణ్యమైన కంపెనీల విత్తనాలతోనే నారు పెంచి విక్రయించాలి.
- స్టాక్ రిజిస్టర్‌ను ఇన్‌వాయిస్‌లు సహా సమగ్రంగా నిర్వహించాలి.
- ప్రతి నర్సరీకి రెండు ద్వారాలు ఏర్పాటు చేయాలి. కానీ ఈ నిబంధనలు ఎక్కడా పూర్తిగా అమలుకావటం లేదు.

"నర్సరీలో నారు కొనుగోలు చేసిన ప్రతి రైతుకూ రశీదు ఇవ్వాల్సిందే. నాణ్యమైన విత్తనాలనే వాడాలి. రైతులకు నాసిరకం మొక్కలను అంటగట్టి చేతులు దులిపేసుకుంటే ఊరుకునేది లేదు. ఉల్లంఘనులపై చట్టపరమైన చర్యలు తప్పవు. బాధిత రైతులు ఫిర్యాదు చేస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటాం."

- ఎంవీ మధుసూదన్, జిల్లా ఉద్యానాధికారి, ఖమ్మం

మదిని దోచే కిన్నెరసాని అందాలు



చుట్టూ పచ్చందాలు పరుచుకున్న కొండలు.. ఉరకలేత్తే అలల సోయగాలు.. వెరసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలంలోని కిన్నెరసాని జలాశయం పర్యాటకుల మది దోచేస్తోంది. సంధ్యా సమయం వేళ అబ్బురపరుస్తున్న కిన్నెరసాని వన్నెలను స్వీయచిత్రాల్లో బంధించేందుకు సందర్శకులు పోటీపడుతున్నారు. – ఈనాడు, ఖమ్మం పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే

అరుదైన రీతిలో.. అరటి హస్తం..!



సహజంగా రెండు అరటిపండ్లు కలిసి ఉంటే జంట పండ్లు లేదా కవల పండ్లు అని అంటుంటారు. అలాంటిది మధిరలో బుధవారం ఏకంగా 8 అరటిపండ్లు కలిసి ఉన్న హస్తం ఓ వ్యాపారి వద్ద అరటిగెలకు వచ్చింది. ఆ వ్యాపారి వాటిని విడదీయకుండా స్థానిక ప్రధాన వీధిలోని విఘ్నేశ్వర ఆలయంలో స్వామివారి ముందు ఉంచమని పూజారి రవిశాస్త్రికి అందజేశారు. స్థానికులు, భక్తులు వీటిని ఆసక్తిగా తిలకించారు. దీనిపై జిల్లా ఉద్యాన అధికారి జి.మరియన్న 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో, జన్యుమార్పిడితో రెండు, మూడు అరటి కాయలు కలిసి ఉంటాయి. ఎనిమిది అరటికాయలు కలిసి ఉండటం అరుదేనని తెలిపారు. – మధిర, న్యూస్‌టుడే

నైపుణ్యంపై ఆసక్తి.. సంపాదన శక్తి

పాల్వంచ, న్యూస్‌టుడే



తాటి ఆకులతో వివిధ ఉత్పత్తులు తయారు చేస్తున్న మహిళలు

చదువుతో నిమిత్తం లేదు. కావాల్సిందల్లా ఏకాగ్రత. కాస్త ఓపిక చేసుకుని శిక్షణ పొందితే చాలు.. జీవనోపాధి తథ్యం. కొందరు వనితలు అబ్బురపరిచే తాటాకు ఉత్పత్తులను తమ సృజనాత్మకతతో రూపొందిస్తున్నారు. వీరు రూపొందించే రంగురంగుల బుట్టలు, గృహాలంకరణ వస్తువులకు మార్కెట్లో మంచి గిరాకీ ఉంటోంది. దేశంలోని వివిధ రాష్ట్రాల్లోనే కాకుండా.. సింగపూర్, అమెరికా, శ్రీలంక, ఆస్ట్రేలియాలకు ఆన్‌లైన్ ఆర్డర్‌పై సరఫరా చేస్తుండటం విశేషం. తాటాకు అల్లికపై పాల్వంచలోని నవ లిమిటెడ్ వారు కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా అందించే మూణ్నెల్ల శిక్షణను ఎంతో మంది మహిళలు సద్వినియోగం చేసుకుంటున్నారు. ఇక్కడ సాధారణ శిక్షణతో మహిళా స్వావలంబనకు ఏడేళ్లుగా కృషిచేస్తోంది. స్థానికులతో పాటు కొత్తగూడెం, ఇల్లెందు పట్టణాలు, సమీప మండలాలకు చెందిన సుమారు 200 మందికి పైగా స్వయం ఉపాధి పొందుతుండటం విశేషం. ఆసక్తి ఉన్నవారెవరైనా ఇక్కడ శిక్షణ పొందే అవకాశం ఉంది.

కుటుంబ పోషణకు సరైన మార్గం

– స్వరూపరాణి, సంజయ్‌నగర్



చదువుతో సంబంధం లేకుండా మహిళా సాధికారత కేంద్రంలో శిక్షణ ఇవ్వడం, ఉపాధి మార్గం చూపడం బాగుంది. తాటి ఆకులతో వివిధ రకాల ఆకృతులు తయారు చేయడంలో నైపుణ్యం సాధించా. ఈ కేంద్రంలో పనిచేయడం ద్వారా వచ్చే సంపాదనతో కుటుంబ పోషణకు అండగా నిలుస్తున్నా.

శిక్షణతో పాటు ఉపకార వేతనం

– పద్మ, మంచికంటినగర్



తాటి ఆకులతో తయారు చేసే ఆకర్షణీయ ఉత్పత్తులకు ప్రస్తుత మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. ఇంట్లో ఉంటూనే పలు ఉత్పత్తులు తయారు చేసుకుంటున్నాం. కుటుంబాలకు ఆర్థిక ఆసరాగా నిలవడం సంతోషంగా ఉంది. సంస్థ అందించే ఉచిత, ఉపకార వేతనంతో కూడిన శిక్షణను పేద మహిళలు సద్వినియోగం చేసుకోవాలి.

ఉత్పత్తులకు మార్కెట్లో డిమాండ్

– సత్యవతి, గాంధీనగర్



ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకుందామని నవ లిమిటెడ్ వారి శిక్షణలో చేరా. సృజనాత్మకతతో వస్తువులు రూపొందిస్తుండటంతో మూణ్నెల్ల కాలం వేగంగా గడిచిపోయింది. నా వృత్తి నైపుణ్యంతో ఇప్పుడు మా కుటుంబానికి జీవనోపాధి లభించింది. నేను తయారు చేసే బుట్టలు, గృహాలంకరణ వస్తువులకు మంచి డిమాండ్ ఉండటంతో కుటుంబం గడిచేందుకు సంపాదన లభిస్తోంది.

ఖాళీ సమయం.. సద్వినియోగం

– పద్మ, గాంధీనగర్



కొన్నేళ్లపాటు ఇంట్లో ఖాళీగా ఉన్నా. ఆ సమయంలో ఏం చేయాలో పాలుపోలేదు. చివరకు ఉచిత శిక్షణ గురించి తెలిసి అక్కడ చేరా. కోర్సు పూర్తవక ముందే ఉపాధి కల్పిస్తుండటం మంచి అవకాశంగా భావించా. ఎంతో ఆసక్తితో, ఉత్సాహంగా నైపుణ్యాల్ని నేర్చుకున్నా. ఇలాంటి కార్యక్రమాలు మహిళలకు ఆర్థికంగా భరోసా కల్పిస్తాయనడంలో సందేహం లేదు.

రాములోరికి ఘనంగా తిరుమంజనం



భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో బుధవారం తిరుమంజనం ఘనంగా నిర్వహించారు. కోదండ రాముడికి అర్చకులు సుప్రభాతం పలికి నామార్చనలు నిర్వహించారు. క్షేత్ర విశిష్టతను వైదిక పెద్దలు ప్రవచించారు. సీతమ్మవారికి యోక్త్రధారణ, రామయ్యకు యజ్ఞోపవీతధారణ చేయించారు. మాంగల్యధారణ, తలంబ్రాల వేడుక పరమానందకరంగా సాగాయి. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ కుటుంబ సమేతంగా వచ్చి రామయ్యను దర్శించుకున్నారు. ఈయనకు ఏఈఓ భవానిరామకృష్ణారావు, పీఆర్వో సాయిబాబా స్వాగతం పలకగా.. వేద పండితుడు ఆశీర్వచనం అందించారు.

టెన్నిస్‌లో ఇన్‌స్పెక్టర్ల ప్రతిభ



సీఐలు సతీశ్, రామరాయులును అభినందిస్తున్న సునీల్‌దత్

ఖమ్మం నేరవిభాగం: రాష్ట్రస్థాయి టెన్నిస్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ కె.సతీశ్, ఎం.రామరాయులు జంటను సీపీ సునీల్‌దత్ తన కార్యాలయంలో బుధవారం అభినందించారు. ఈ నెల 3 నుంచి హైదరాబాద్ వశిష్ఠ టెన్నిస్ అకాడమీలో జరిగిన హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంటులో 30 ఏళ్ల విభాగంలో ఇన్‌స్పెక్టర్లు రన్నర్‌గా నిలిచారు.

మావోయిస్టు వాల్‌పోస్టర్ల కలకలం

బూర్గంపాడు, న్యూస్‌టుడే: మండలంలో మావోయిస్టు వాల్‌పోస్టర్లు, ఫ్లెక్సీలు కలకలం రేపాయి. సందెళ్లరామాపురం అటవీ ప్రాంతంలో మణుగూరు-పాల్వంచ ఏరియా కమిటీ, బీకేఏస్‌ఆర్ డివిజన్ కమిటీ పేరిట మంగళవారం అర్ధరాత్రి ఫ్లెక్సీలు వెలిశాయి. మావోయిస్టు పార్టీ వార్షికోత్సవాలను విప్లవోత్సాహంతో నిర్వహించుకోవాలని పోస్టర్లలో ముద్రించి ఉంది. ఆపరేషన్ కగార్ దాడిని ఓడించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ ఘటనపై అదనపు ఎస్సై నాగభిక్షంను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా మావోయిస్టు వాల్ పోస్టర్లు వెలిసిన ప్రాంతాన్ని పరిశీలించి విచారణ చేపట్టామని తెలిపారు.

పెండింగ్ దరఖాస్తులు పూర్తి చేయాలి: డీటీసీ



అధికారులతో మాట్లాడుతున్న డీటీసీ శ్రీనివాసరావు

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: జిల్లా రవాణాశాఖకు సంబంధించి పెండింగ్ దరఖాస్తులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్(డీటీసీ) డాక్టర్ పుప్పాల శ్రీనివాసరావు ఆదేశించారు. ఖమ్మం జిల్లా రవాణా శాఖ కార్యాలయాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం అధికారులు, ఉద్యోగులతో సమావేశమయ్యారు. దరఖాస్తుదారులకు ఇబ్బందులు కలగకుండా మెరుగైన సేవలు అందించాలన్నారు. నిర్వహణలో లోపాలు లేకుండా జాగ్రత్తలు పాటించాలని ఆదేశించారు. జిల్లాలో శాఖాపరమైన ప్రభుత్వ లక్ష్యం 95 శాతం, త్రైమాసిక పన్నుల వసూళ్లలో 101 శాతం పురోగతి సాధించినట్లు డీటీసీ వెల్లడించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ పెంచి ఆదాయాన్ని పెంచాలని ఇన్‌స్పెక్టర్లకు సూచించారు. జిల్లాలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్(ఐటీడీఆర్)కు స్థలం మంజూరు కావాల్సి ఉందన్నారు. సత్తుపల్లి ఆర్టీఏ కార్యాలయం నూతన భవన నిర్మాణంపై కమిషనర్‌కు రిపోర్టు ఇచ్చామన్నారు. జిల్లా ఇన్‌ఛార్జి డీటీఓ, ఖమ్మం ఎంవీఐ వాకదాని వెంకటరమణ, ఏఎంవీఐ రెంటాల స్వర్ణలత, ఏఓ జావెద్ అలీ, ఉద్యోగులు పాల్గొన్నారు.

అంకుర హాస్పిటల్ ప్రారంభం



అంకుర హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆసుపత్రి డైరెక్టర్ డా. రాకేశ్

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: ఖమ్మం నగరంలో నూతనంగా నెలకొల్పిన అంకుర హాస్పిటల్‌ను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఔట్ పేషెంట్ విభాగాన్ని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, నియోనాటల్ ఐసీయూను లోక్‌సభ సభ్యుడు రామసహాయం రఘురాం రెడ్డి బుధవారం ప్రారంభించారు. స్థానిక సీక్వెల్ రిసార్ట్స్ రోడ్డులో 120 పడకలతో నూతన హాస్పిటల్ నిర్మించారు. ముఖ్య అతిథులుగా హాజరైన మంత్రులు మాట్లాడుతూ.. యాజమాన్యం నాణ్యమైన వైద్య సేవలను అందించి ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. అత్యాధునిక పరికరాలతో హాస్పిటల్ యాజమాన్యం జిల్లావాసులకు మెరుగైన వైద్య సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. వ్యవస్థాపకులు వున్నం కృష్ణప్రసాద్ మాట్లాడుతూ.. తల్లీపిల్లల ఆరోగ్య సంరక్షణకు అంకుర బృందం నిరంతరం శ్రమిస్తోందని అన్నారు. అత్యాధునిక ఎన్ఐసీయూ, పీఐసీయూ యూనిట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. సంతానోత్పత్తి సేవల కోసం 3ఎం ఫెర్టిలిటీ సేవలను ప్రవేశపెట్టామన్నారు. మేయర్ పునుకొల్లు నీరజ, ఆస్పత్రి డైరెక్టర్ చల్లగుళ రాకేశ్, సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కార్పొరేషన్ ఛైర్మన్లు మువ్వా విజయ్‌బాబు, రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, డీఎంహెచ్‌ఓ సుబ్బారావు, కార్పొరేటర్ కర్నాటి కృష్ణ పాల్గొన్నారు.

సుహాస్ 'సిల్వర్ ప్యారడైజ్' ప్రారంభం

ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే: ప్రముఖ ఆభరణాల సంస్థ సుహాస్ జ్యూయలరీస్ స్థాపించి ఐదేళ్లు పూర్తయిన నేపథ్యంలో ఖమ్మం వైరా రోడ్డులో ప్రత్యేకంగా 'సిల్వర్ ప్యారడైజ్' షోరూంను ప్రారంభించారు. సుహాస్ జ్యూయలరీస్ నిర్వాహకులు దుగ్గి సుహాస్, సంతోషి దంపతులు, సాహితి.. జ్యోతి వెలిగించి షోరూంను ప్రారంభించారు. సంస్థ అధినేత దుగ్గి సతీశ్‌కుమార్ మాట్లాడుతూ.. తమ సంస్థ 5వ వార్షికోత్సవం సందర్భంగా వినియోగదారులకు ప్రత్యేక ఆఫర్లు అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. ఏ వస్తువుపైనైనా 5.9 నుంచి 11.9 శాతం తరుగు తీసుకుంటామని, ఈనెల 29వ తేదీ వరకు రాయితీ కొనసాగుతుందని చెప్పారు. ప్రతి కొనుగోలుదారుకు లక్కీ డ్రా కూపన్ అందిస్తామని, డ్రాలో మొదటి బహుమతి 50 గ్రాముల బంగారం, రెండో బహుమతి 20, మూడో బహుమతి 10 బంగారం... అలాగే నాలుగో బహుమతి 100 గ్రాముల వెండి, ఐదో బహుమతిగా 50 గ్రాముల వెండి ఇస్తామని తెలిపారు. ప్రతి రూ.లక్ష కొనుగోలుపై రూ.500 వెండి కూపన్ అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో షోరూం ఉద్యోగులు పాల్గొన్నారు.



జ్యోతి వెలిగించి షోరూంను ప్రారంభిస్తున్న సుహాస్ జ్యూయలరీస్ నిర్వాహకులు

ఆటోని ఢీకొన్న ఆర్టీసీ బస్సు: ఇద్దరు యువకుల దుర్మరణం



ఘటనా స్థలంలో యువకుల మృతదేహాలు

జూలూరుపాడు, న్యూస్‌టుడే: ఆటోని ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు భవాని భక్తులు దుర్మరణం చెందిన సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం కొమ్ముగూడెం వద్ద బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పాల్వంచ మండలం జగన్నాథపురం బసవతారక కాలనీకి చెందిన గుగులోత్ మనోహర్(20), బానోత్ సంతోష్(24) ఆటోలో జూలూరుపాడు వైపు వస్తున్నారు. వీరిలో ఒకరు ఆటో నడుపుతుండగా, మరొకరు వెనుక కూర్చున్నారు. ఈ క్రమంలోనే ఎదురుగా వచ్చిన మణుగూరు ఆర్టీసీ డిపో బస్సు ఢీకొంది. దీంతో ఆటో నుజ్జుకాగా, దానిలోని ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతిచెందారు. వీరిలో సంతోష్ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వహిస్తుండగా, మనోహర్ ప్రైవేటు ల్యాబ్‌టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. ఇటీవలనే ఈ ఇద్దరు యువకులు భవానీ మాల ధరించారు. సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్సై రాణాప్రతాప్, హెడ్‌కానిస్టేబుల్ దయానంద్‌లు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుల కుటుంబ సభ్యులు ప్రమాద స్థలానికి చేరుకుని బోరున విలపించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కొత్తగూడెం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బతుకమ్మపూల కోసం వెళ్లి..

చెరువులో మునిగి ఒకరు మృతి



నున్నా ఐలయ్య

అశ్వాపురం, న్యూస్‌టుడే: పండుగ పూట విషాదం చోటుచేసుకుంది. అశ్వాపురం మండలం జగ్గారం గ్రామంలో నున్నా ఐలయ్య(38) బుధవారం ఉదయాన్నే బతుకమ్మ పూల కోసం వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతి చెందారు. ఐలయ్యకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన మణుగూరులోని సురక్ష బస్టాండ్‌లో హమాలీగా పనిచేస్తున్నారు. ఐలయ్యకు ఈత రాదు. పూల కోసం దిగిన చోట పెద్ద గుంత ఉండగా ఒక్కసారిగా నీటి మునిగారు. ఇది చూసి చుట్టు పక్కల ఉన్నవారు పెద్దగా కేకలు వేశారు. కొందరు నీళ్లల్లో దూకి కాపాడే ప్రయత్నం చేయగా.. అప్పటికే ఐలయ్య మృతిచెందారు.


ఉద్యోగ విషయంపై మనస్తాపంతో యువతి బలవన్మరణం

మాదాపూర్, న్యూస్‌టుడే: ఉరేసుకొని యువతి బలవన్మరణానికి పాల్పడిన ఘటన హైదరాబాద్‌లో చోటుచేసుకుంది. మాదాపూర్ ఎస్సై శ్వేత తెలిపిన వివరాల ప్రకారం.. మణుగూరుకు చెందిన మహ్మద్ ముస్కాన్(23) హైటెక్ సిటీలోని ఓ ఐటీ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. పనిఒత్తిడి కారణంగా ఉద్యోగం మానేసి రెండు నెలలుగా ఖాళీగా ఉంటున్నారు. మరో ఉద్యోగం కోసం అన్వేషిస్తున్న ఆమె రెండు రోజుల క్రితం మాదాపూర్ క్యాపిటల్ రోడ్డులోని హాస్టల్‌లో తన సోదరి హసీనా వద్దకు చేరుకున్నారు. మంగళవారం సాయంత్రం హసీనాతోపాటు మిగతా రూమ్మేట్స్ ఉద్యోగాలకు వెళ్లారు. ఆ సమయంలో ముస్కాన్ ఒంటరిగా ఉన్నారు. విధులు ముగించుకొని హసీనా బుధవారం తెల్లవారుజామున హాస్టల్‌కు వచ్చి చూడగా గది తలుపులు పెట్టి ఉన్నాయి. ముస్కాన్‌కు ఫోన్ చేసినా ఎత్తలేదు. అనుమానం వచ్చిన హాస్టల్ సిబ్బంది పోలీసులకు సమాచారమందించారు. వారొచ్చి గది తలుపులు పగలగొట్టి చూడగా ముస్కాన్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకొని వేలాడుతూ కనిపించారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రేమించి.. పెళ్లికి నిరాకరించిన యువకుడి అరెస్టు

సైదాబాద్, న్యూస్‌టుడే: ప్రేమ పేరిట యువతిని గర్భవతిని చేసి, పెళ్లికి నిరాకరించిన యువకుడిని సైదాబాద్ ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై నాగిశెట్టి సాయికృష్ణ వివరాల ప్రకారం.. ఆసిఫ్‌నగర్‌కు చెందిన యువతి (21) దిల్‌సుఖ్‌నగర్‌లో కానిస్టేబుల్ ఉద్యోగానికి శిక్షణ పొందేందుకు 2022లో చేరారు. ఆ సమయంలో ఖమ్మం జిల్లాకు చెందిన మహేందర్ (24) పరిచయమయ్యాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా లొంగదీసుకున్నాడు. 2023లో గర్భం దాల్చడంతో, కొంతకాలం ఆగిన తర్వాత పెళ్లి చేసుకుంటానని నమ్మించి అబార్షన్ చేయించాడు. అనంతరం పెళ్లికి నిరాకరించడంతో బాధితురాలు గతనెలలో పోలీసులను ఆశ్రయించారు. యువకుడిని పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకుని రిమాండ్ చేశారు.

చికెన్ ధరలు



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.

ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో ధరలు (రూ.లలో)


పంట పేరు	కనిష్ఠ	గరిష్ఠ	నమూనా
కొత్తపత్తి	6,000	6,900	6,700
పాతపత్తి	7,000	7,400	7,300
పెసలు	6,600	7,300	6,775
కందులు	5,200	9,200	9,000
ఏసీ ఎండుమిరప	10,000	19,700	16,400
ఎండుమిరప	9,500	18,600	17,200

భద్రాద్రి ఇన్‌ఛార్జి డీహెచ్‌ఎస్‌ఓగా కిశోర్



ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల ఇన్‌ఛార్జి అధికారిగా జె.కిశోర్‌ను నియమించారు. ఈమేరకు రాష్ట్ర అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇక్కడ జిల్లా అధికారిగా పని చేసిన సూర్యనారాయణ ఏసీబీకి చిక్కి సస్పెండ్ అయిన విషయం తెలిసిందే. ఆ తర్వాత మూడు రోజుల కిందట కరీంనగర్ జిల్లా అధికారిగా పని చేస్తున్న ఆర్.శ్రీనివాసరావును భద్రాద్రి జిల్లాకు బదిలీ చేశారు. ఆయన మెడికల్ లీవ్ పెట్టడంతో ప్రస్తుతం కిశోర్‌కు జిల్లా ఇంఛార్జి బాధ్యతలు అప్పగించారు. ఆయన ప్రస్తుతం అశ్వారావుపేట కొబ్బరి విత్తనోత్పత్తి కేంద్రం, అచుత్యాపురంలోని ఉద్యాన నర్సరీలో ఉద్యాన అధికారిగా పని చేస్తున్నారు. కొత్తగా మరో అధికారిని ఇక్కడకు బదిలీ చేసే వరకు ఇంఛార్జి బాధ్యతల్లో విధులు నిర్వహించనున్నారు. రాష్ట్రంలో ఉన్న పలువురు అధికారులు భద్రాద్రి జిల్లాకు రావాలంటే భయపడిపోతున్నారు. చాలామంది ఇక్కడకు వచ్చేందుకు సుముఖత వ్యక్తం చేయడం లేదు. దీంతో ప్రభుత్వం ఇన్‌ఛార్జి అధికారిని నియమించింది.

పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కాంతారావు



పాల్వంచ, న్యూస్‌టుడే: పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అరికొట్ల కాంతారావు బుధవారం నియమితులయ్యారు. ఆయన నియామకంపై సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లాల అధ్యక్షులు ఎలమద్ది వెంకటేశ్వర్లు, డీవీ వెంకటేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. కాంతారావు ప్రస్తుతం ఖమ్మం జిల్లా బోనకల్లు మండలం జానకీపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఉపాధ్యక్షుడ్ని ఎన్నుకున్నారు.

ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం

☆ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఐదున్నర సంవత్సరాల పదవీ కాలంలో శాసన మండలిలో ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం చేసినట్లు ఉపాధ్యాయ శాసన మండలి సభ్యుడు అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. త్వరలో జరిగే ఖమ్మం, వరంగల్, నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి తిరిగి పోటీ చేసేందుకు యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ ఏకగ్రీవంగా తీర్మానించిన అనంతరం తొలిసారిగా ఖమ్మం విచ్చేశారు. ఖమ్మంలోని జిల్లా కార్యాలయంలో బుధవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. విద్యారంగం, ఉపాధ్యాయుల, అధ్యాపకుల సమస్యల పరిష్కారం కోసం శాసన మండలిలోనూ, బయట పోరాటాల సందర్భంగా శక్తి మేరకు కృషి చేశానని అన్నారు. మరోసారి తనను గెలిపించాలని కోరారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి మాట్లాడుతూ... నర్సిరెడ్డి లాంటి వారు చట్టసభల్లో ఉండాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె.జంగయ్య, రాష్ట్ర నాయకురాలు చావా దుర్గాభవాని, రాములు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీవీ నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు, వెంకన్న, రాంబాబు, రంజాన్ తదితరులు పాల్గొన్నారు. వివిధ ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలకు చెందిన పలువురు జిల్లా, రాష్ట్ర బాధ్యులు పాల్గొని నర్సిరెడ్డికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు.




ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డిని అభినందిస్తున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.జంగయ్య, చావా రవి తదితరులు

మనసు బాగుంటే ఆనందం మీ వెంటే!

☆ నేడు 'ప్రపంచ మానసిక ఆరోగ్య దినం'

ఖమ్మం వైద్యవిభాగం, న్యూస్‌టుడే

శారీరక ఆరోగ్యంతోపాటు మనసుకూ ప్రాధాన్యం ఇవ్వాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఉరుకులూ పరుగుల జీవితంలో సరైన ఆహారం, నిద్ర కరవవుతున్నాయి. మానసిక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. దీంతో మానసిక ఆరోగ్యంపై దృష్టి సారించాల్సిన అవసరంపై ప్రపంచ వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఈ ఏడాది 'ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం' 'పని ప్రదేశాల్లో మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యం' పేరిట దినోత్సవం జరపాలని డబ్ల్యూహెచ్‌ఓ నిర్ణయించింది.



పెరుగుతున్న బాధితులు

జిల్లాలో మానసిక సమస్యల బాధితులు పెరుగుతున్నారు. అన్ని వయసులవారు ఈ ప్రభావానికి లోనవుతున్నారు. ఉద్యోగ జీవితం, సహచరుల ప్రవర్తన, ఇతర కారణాలతో అనేక మంది మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు. పని ప్రదేశాల్లో మహిళలు ఎక్కువగా సమస్య ఎదుర్కొంటున్నారని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఇటీవల పురుషులూ ఆస్పత్రులకు వస్తున్నారు. కార్పొరేట్ సంస్థల్లో పని చేస్తున్న వారిపై ఈ ప్రభావం అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది.

మెరుగైన వైద్య సేవలు

ప్రభుత్వం ప్రత్యేకంగా 14416 హెల్ప్‌లైన్ ద్వారా బాధితులకు సేవలందిస్తోంది. ఎవరైనా ఫోన్ చేసి సహాయం పొందవచ్చు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 653 మంది సేవలు పొందారు. మానసిక వ్యాధిగ్రస్థులను గుర్తించే క్రమంలో ఆరోగ్యశాఖ ప్రత్యేక సర్వే నిర్వహించింది. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో వైద్య సేవలందిస్తూ మెరుగైన వైద్యం కోసం ఖమ్మం సర్వజనాసుపత్రి మెంటల్ హెల్త్ క్లినిక్‌కు రిఫర్ చేస్తోంది. ఇప్పటివరకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో 313 మంది చికిత్సలు పొందినట్లు ఆరోగ్యశాఖ గణాంకాలు చెబుతున్నాయి.

సత్తుపల్లి

•సత్తుపల్లి •మధిర • వైరా

పినపాక గ్రామం నుంచి టీచర్లుగా ఐదుగురు ఎంపిక



తల్లాడ, న్యూస్‌టుడే: తల్లాడ మండలం పినపాక గ్రామానికి చెందిన ఐదుగురు టీచర్లుగా ఎంపిక అయ్యారు. గ్రామానికి చెందిన తాళ్లూరి ముత్తారావు, తనీషా, షాలిని, లక్ష్మీప్రసన్న, షేక్ జాన్‌పాషా డీఎస్సీ ఫలితాల్లో టీచరు ఉద్యోగాలు సాధించారు. ఈ ఐదుగురు టీచర్లు బుధవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలను అందుకున్నారు. ఒకే గ్రామం నుంచి ఐదుగురు టీచరు ఉద్యోగాలు సాధించడం పట్ల గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

గొర్రెల పెంపకందారుల సంఘం ఎన్నికకు నోటిఫికేషన్ జారీ

చింతకాని, న్యూస్‌టుడే: శ్రీరామ ప్రాథమిక గొర్రెల పెంపకందారుల సహకార సంఘం పాలకమండలి ఎన్నిక ఈనెల 22న జరుగుతుందని ఎన్నికల అధికారి, మధిర సహాయ సహకార అధికారి బి.ఏడుకొండలు పేర్కొన్నారు. ఈ ఎన్నికకు సంబంధించి నోటిఫికేషన్‌ను బుధవారం ఆయన విడుదల చేశారు. సంఘం బాధ్యులు ఇమ్మడి కాశయ్య, పరిటాల లక్ష్మణస్వామి, కొండలరావు, పుల్లారావు, తిరుపతిరావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
సత్తుపల్లి : 93922 39905
మధిర : 98668 05652
వైరా : 76619 46938

సమస్య: మధిర పురపాలక సంఘంలో ప్రజాసమస్యలు తెలుసుకునేందుకు సోమవారం ప్రజావాణి ఏర్పాటు చేయాలి.
- దొడ్డా రామకృష్ణారావు

సమాధానం: ప్రజల సమస్యలు ప్రతిరోజూ తెలుసుకుంటూ వెంటనే వారి సమస్యలు పరిష్కరిస్తున్నాం. - ఉదయ్‌కుమార్, మున్సిపల్ మేనేజరు, మధిర

– మధిర గ్రామీణం, న్యూస్‌టుడే

నాన్నకు ప్రేమతో..

కారేపల్లి, న్యూస్‌టుడే

ఆ యువతి చదివింది సాఫ్ట్‌వేర్ అయినా తండ్రి ఆశయాల కోసం ఖాకీ యూనిఫాం కొలువు సాధించారు. కారేపల్లి మండలం కొత్త కమలాపురానికి చెందిన కేతారపు కల్యాణి కారేపల్లిలో బీటెక్ చదివారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వైపు కాకుండా తన తండ్రికి పోలీసు ఉద్యోగంపై ఉన్న మక్కువను గ్రహించి ఆ దిశగా అడుగులు వేశారు. తాను పోలీసు అవుదామనుకున్నప్పటికీ కాలేకపోయానని తరచూ కుటుంబ చర్చల్లో కల్యాణి తండ్రి ప్రస్తావించేవారు. ఈక్రమంలో 2020లో కల్యాణి సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించారు. అదే సమయంలో అబ్కారీ, ఆర్పీఎఫ్, బీఎస్ఎఫ్ కానిస్టేబుల్ ఉద్యోగాలు సైతం పొందడం విశేషం. సివిల్ కానిస్టేబుల్‌గా ఖమ్మం జిల్లా కామేపల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లిలో కొన్నేళ్లు విధులు నిర్వహించారు.



తల్లిదండ్రులతో కల్యాణి

అంతటితో ఆగకుండా...

కానిస్టేబుల్ కొలువు చేస్తూనే 2024లో ఎస్సై నోటిఫికేషన్ వెలువడటంతో సన్నద్ధమయ్యారు. అందులో భాగంగా కారేపల్లి మండలం నుంచి వందల మంది ఉద్యోగ వేటలో కఠోర శ్రమ చేసినప్పటికీ మండలం నుంచి ఒక్క కల్యాణికి మాత్రమే అదృష్టం వరించింది. సివిల్ ఎస్సైగా ఎంపికయ్యారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఎస్సైగా హైదరాబాద్‌లో శిక్షణ పూర్తి చేసుకున్నారు. ప్రస్తుతం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు అలాట్ కావడం విశేషం.

రైతులతో మమేకమవుతున్నాం

వైరా, న్యూస్‌టుడే

పంటల సాగు, సస్య రక్షణ చర్యల విషయంలో రైతులకు నాణ్యమైన సేవలందిస్తున్నామని వ్యవసాయ శాఖ డివిజన్ ఏడీ తుమ్మలపల్లి కరుణశ్రీ పేర్కొన్నారు. వైరా, కొణిజర్ల, ఏన్కూరు, కారేపల్లి మండలాల్లో పంటల సాగు పెరిగిందని అనుక్షణం రైతులతో మమేకమవుతూ అప్రమత్తం చేస్తున్నామన్నారు. 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో ఆమె పలు విషయాలు వెల్లడించారు.



వ్యవసాయ శాఖ ఏడీ కరుణశ్రీతో ముఖాముఖి

ప్రశ్న: డివిజన్‌లో రుణమాఫీకాని వారి నిర్ధారణ ఎలా ఉంది?

జవాబు: డివిజన్‌లోని నాలుగు మండలాల్లో రూ.2 లక్షలలోపు రుణం ఉండి కుటుంబ నిర్ధారణ చేయాల్సిన వారు 9,121 మంది ఉన్నారు. వీరిలో 6,694 మందిని కుటుంబ నిర్ధారణ చేశాం. ఇంకా ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటి వరకు 13,934 మంది రైతులకు రుణమాఫీ నగదు జమ అయ్యింది.

గత నెలలో భారీ వర్షాలతో ఎంత పంట నష్టం జరిగింది?

▌ భారీ వర్షాలతో ప్రాథమిక నష్టం గుర్తించి అనంతరం తుది జాబితాను తయారు చేశాం. 1,119 మంది రైతులకు చెందిన 1,097 ఎకరాల్లో పూర్తి పంట నష్టం జరిగినట్లు ప్రభుత్వానికి నివేదించాం. వీరికి పరిహారం అందుతుంది. ఎక్కువగా వరిపంటకు నష్టం వాటిల్లింది.

డివిజన్‌లో పంటల సాగు ఎలా ఉంది?

▌ వైరా, కొణిజర్ల, ఏన్కూరు, కారేపల్లి మండలాల పరిధిలో పత్తి 53 వేల ఎకరాలు, మిరప 15 వేల ఎకరాల్లో, వరి 36 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. పంటల సాగును నిత్యం పరిశీలిస్తున్నాం. రైతులతో మమేకమవుతున్నాం.

పంటల సాగులో ఉన్న ప్రతికూలతలు?

▌ ప్రస్తుతం పత్తి, మిరపలో రసం పీల్చే పురుగు సమస్య ఎక్కువగా ఉంది. వరిలో బ్యాక్టీరియా ఆకుమచ్చ తెగులు, సుడిదోమ సమస్య ఎక్కువగా వస్తుంది. ఏఈవోలు, ఏవోలు నిత్యం ఆయా క్షేత్రంలో పొలాలను పరిశీలించి రైతులను అప్రమత్తం చేస్తున్నారు. చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను వివరిస్తున్నాం.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ఏర్పాట్లు చేస్తున్నారా?

▌ ధాన్యం కొనుగోలు కేంద్రాలపై ఇప్పటికే స్పష్టత వచ్చింది. డివిజన్‌లో 41 కేంద్రాల్లో సన్న ధాన్యం కొనుగోలు చేసేందుకు, మరో 5 కేంద్రాలు దొడ్డు ధాన్యం కొనుగోలు చేసేందుకు ఏర్పాటు చేస్తున్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా పర్యవేక్షిస్తాం.




కోదండరామాలయం వద్ద అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీలు

ఆడపిల్లల్ని చదివిద్దాం..


ఏన్కూరు, న్యూస్‌టుడే: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏన్కూరులో బుధవారం వినూత్నంగా బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. వివిధ గ్రామాల అంగన్‌వాడీ ఉపాధ్యాయినులు ఏన్కూరు చేరుకుని ప్రజలకు అవగాహన కల్పించే విధంగా బతుకమ్మలతో ఊరేగింపు చేశారు. కూరగాయలు, ఆకుకూరలు, చిరుధాన్యాలతో బతుకమ్మలను తయారు చేసి వాటి వల్ల లాభాలను వివరిస్తూ ప్రదర్శనలో ఆకర్షణగా నిలిచారు. ప్లకార్డులతో ఆడపిల్లలను బతకనిద్దాం, పుట్టనిద్దాం.. చదవనిద్దాం.. అంటూ ప్రదర్శన చేశారు. కోదండరామాలయం, రాజరాజేశ్వరీ మండపాల వద్దకు వెళ్లి పౌష్టికాహారం, ఆడపిల్లల ఆవశ్యకత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ భవాని, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

పల్లెల్ని చుట్టేసిన.. పచ్చందాలు



రేలకాయలపల్లి, తవసిబోడు, చీమలపాడు ప్రాంతాల చుట్టూరా ఉన్న గుట్టలు నల్లమల్ల అడవులను తలపిస్తున్నాయి. ఎటుచూసిన పచ్చలహారంలా దర్శమిస్తున్నాయి. చుట్టూరా గుట్టలు ఆనుకుని చేలతో ప్రాంత ప్రజలకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. - కారేపల్లి, న్యూస్‌టుడే

గిజిగాడు గూళ్లు.. ఆహ్లాదం మెండు



ఉదయం నుంచి సాయంత్రం వరకు శ్రమించే రైతుకు పచ్చని పొలాలు. నిండైన సాగర్ కాలువలు. ఆ కాలువ కట్టలకు అందమైన గిజిగాడిగూళ్లు ఆనందాన్ని కలిగిస్తాయి. కొణిజర్ల మండలం రెడ్డిగూడెం, పెద్దమునగాల, పెద్దగోపతి సమీపంలోని సాగర్ కాలువ కట్టలపై ఉన్న చెట్లకు గిజిగాడు గూళ్లు అందంగా దర్శనమిస్తున్నాయి. అటుగా వెళ్లే రైతులకు, కూలీలకు ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి. - కొణిజర్ల, న్యూస్‌టుడే

కమ్మేస్తున్న నిర్లక్ష్యం



హిమాంనగర్ నుంచి రేపల్లెవాడ రహదారిలో ముళ్లపొదలు కమ్మేసి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారాయి. గ్యాస్‌స్టేషన్, హిమాంనగర్ సమీపంలో మలుపుల వద్ద మరింత ప్రమాదకరంగా మారాయి. నెలల తరబడిగా ఇలా ఉన్నా ర.భ. అధికారులు పట్టించుకోవడంలేదని, కనీసం పంచాయతీ అధికారులైన శుభ్రం చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ సమస్యపై ఎంపీడీవో ఎస్.రమేశ్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా రహదారికి ఇరువైపులా పొదలు తొలగింపు చేస్తామన్నారు. - ఏన్కూరు, న్యూస్‌టుడే

భవానీల నగర సంకీర్తన

ఏన్కూరు, న్యూస్‌టుడే: వారాహీ బాలభగవద్గీత సేవాసమితి ఆధ్వర్యంలో మాలధరించిన భవానీ భక్తులు బుధవారం రాత్రి నగర సంకీర్తన చేశారు.



జాతర నిర్వహణ అందరి బాధ్యత

కారేపల్లి, న్యూస్‌టుడే: ఉసిరికాయలపల్లి శ్రీకోటమైసమ్మ జాతర ప్రశాంతంగా జరిగేందుకు దేవాదాయశాఖ, పోలీసులతోపాటు ప్రజలు బాధ్యత తీసుకోవాలని అడిషనల్ సీపీ ప్రసాదరావు అన్నారు. జాతర ఏర్పాట్ల పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ప్రధానంగా వాహనాలను ఆర్చిముందు, పక్కన ఏర్పాటు చేసిన ప్రదేశంలో నిలిపి అక్కడి నుంచి ఆలయానికి వెళ్లే విధంగా చూసుకోవాలన్నారు. ఈ ఏడాది భారీ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. శాంతియుత వాతావరణానికి సహకరించాలని ప్రాంగణంలో అల్లర్లు, భక్తులకు ఇబ్బందులు సృష్టించే వారిపై ప్రత్యేక నిఘా విభాగం పని చేస్తుందన్నారు. ఏసీపీ తిరుపతిరెడ్డి, సీఐ తిరుపతిరెడ్డి, ఎస్సై రాజారామ్, ఛైర్మన్ పర్సా పట్టాభి రామారావు, దేవాదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం

పెనుబల్లి, న్యూస్‌టుడే: పెనుబల్లి మండలం లంకపల్లి వద్ద చెట్లకు నీళ్లు పోస్తున్న ట్రాక్టర్‌ను కంటైనర్ లారీ ఢీ కొట్టిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఎవ్వరికీ ఏమీ కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఖమ్మం వైపు నుంచి సత్తుపల్లి వైపు వెళ్తున్న కంటైనర్ లారీ లంకపల్లి వద్ద రహదారి పక్కన చెట్లకు నీళ్లు పోస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది.

తల్లాడ రింగురోడ్డు కూడలిలో లైట్లు ప్రారంభం



రింగు కూడలిలో అధికారులు, నాయకులతో ఎమ్మెల్యే రాగమయి

తల్లాడ, న్యూస్‌టుడే: తల్లాడ రింగు రోడ్డు కూడలిలో నూతనంగా ఏర్పాటు చేసిన హైమాస్‌లైట్లు, వాటర్ ఫౌంటేన్‌ను బుధవారం రాత్రి సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి ప్రారంభించారు. తల్లాడ మండల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ చంద్రమౌళి, ఎంపీఓ శ్రీదేవి, ఈవో కృష్ణారావు, ఎస్సై కొండలరావు, పార్టీ మండల అధ్యక్షుడు కాపా సుధాకర్, దగ్గుల రఘుపతిరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి'

మధిర, న్యూస్‌టుడే: సమాజంలో ప్రతి ఒక్కరు మానసిక ఆరోగ్యంపైనా శ్రద్ధ చూపాలని, ఒత్తిడిని తగ్గించుకోవాలని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యులు వి.వెంకటేశ్వర్లు సూచించారు. మధిర ఎస్సీకాలనీ ఐదో అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఆదేశాల మేరకు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన శిబిరాన్ని నిర్వహించారు.

గ్రామీణ వైద్యుని కుటుంబానికి మంత్రి పరామర్శ

తల్లాడ, న్యూస్‌టుడే: తల్లాడ మండలం నారాయణపురం గ్రామానికి చెందిన గ్రామీణ వైద్యుడు బొగ్గుల కృష్ణారెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆయన చిత్రపటానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మువ్వా విజయ్‌బాబు, బొర్రా రాజశేఖర్, మట్టా దయానంద్, గోపిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సామ్రాట్‌కు నేతల నివాళి

ముదిగొండ, న్యూస్‌టుడే: గోకినేపల్లిలో కొమ్మినేని సామ్రాట్ 12వ వర్ధంతి బుధవారం నిర్వహించారు. సామ్రాట్ స్మారక స్తూపం వద్ద రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు నివాళులర్పించారు.

పంచాయతీరాజ్ ఏఈల బాధ్యతల స్వీకరణ

కల్లూరు, న్యూస్‌టుడే: కల్లూరు పంచాయతీరాజ్ సబ్‌డివిజన్‌లో కల్లూరు మండలానికి సంబంధించిన ఏఈలుగా ఎన్.కార్తిక్‌కుమార్, భూక్యారాజ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు.



ఎన్.కార్తిక్ కుమార్ భూక్యా రాజ్

రూ.5 లక్షల చెక్కు అందజేత

తల్లాడ, ఏన్కూరు, న్యూస్‌టుడే: తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామానికి చెందిన సీనియర్ 108 ఉద్యోగి(పైలెట్) బెజవాడ కృష్ణ అనారోగ్యంతో సంవత్సరం క్రితం మృతి చెందాడు. సదురు ఉద్యోగి పని చేస్తున్న జీవీకే, ఈఎంఆర్ఐ ప్రోగ్రాం మేనేజర్ భూమా నాగేందర్, ఈఎంఈ ఎ.దుర్గ 108 ఉద్యోగి కృష్ణ కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల చెక్కును బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో 108 సిబ్బంది మహేందర్, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ శ్రేణుల పరామర్శ

కారేపల్లి, న్యూస్‌టుడే: వారం క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించిన గుట్టకిందగుంపునకు చెందిన భార్యభర్తల కుటుంబాన్ని సీఐటీయూ శ్రేణులు బుధవారం పరామర్శించారు. సంఘం మండల కార్యదర్శి కె.నరేంద్ర, కేలోతు రవి, సీతరాములు, రమేశ్, భద్రం పాల్గొన్నారు.

సేవా సమితి సభ్యులకు చీరల పంపిణీ

ఎర్రుపాలెం, న్యూస్‌టుడే: జమలాపురంలో శ్రీవేంకటేశ్వర అన్నదాన సేవా సమితి సభ్యులకు బుధవారం దాత తూళ్లూరు కోటేశ్వరరావు, నిర్మలాకుమారి దంపతులు చీరలు పంపిణీ చేశారు.

భక్తజనం.. భక్తిభావం

మధిర గ్రామీణం, చింతకాని, ఎర్రుపాలెం, న్యూస్‌టుడే: మధిర, చింతకాని మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాల వద్ద బుధవారం అమ్మవారు సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం మూలనక్షత్రం సందర్భంగా చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఆలయ ఈఓ కె.జగన్మోహన్ రావు, ధర్మకర్త శ్రీరామచంద్రమూర్తి, పర్యవేక్షకులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

తల్లాడ, వేంసూరు, కల్లూరు, న్యూస్‌టుడే: వేంసూరు మండలం లింగపాలెం హరిహర క్షేత్రంలో అమ్మవారు సరస్వతిదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. మర్లపాడులో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. కల్లూరు పట్టణ పరిధిలోని పుల్లయ్యబంజర్ రోడ్డు, కల్లూరు జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన అమ్మవారి సన్నిధిలో చిన్నారుల చేత సరస్వతి పూజ చేయించారు.

కొణిజర్ల, ఏన్కూరు, న్యూస్‌టుడే: కొణిజర్లలోని గంగపాలెం, బీసీకాలనీ, పల్లిపాడు, తనికెళ్లలోని అమ్మవారి విగ్రహాలను సరస్వతిదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఏన్కూరులో కోదండ రామాలయం, శ్రీరాజరాజేశ్వరీ మండపం వద్ద ఏర్పాటు చేసిన సామూహిక పూజల్లో విద్యార్థులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకలు

వైరా, ఏన్కూరు, ముదిగొండ, కల్లూరు, వేంసూరు, న్యూస్‌టుడే: ఐద్వా ఆధ్వర్యంలో వైరా బ్రాహ్మణపల్లిలో బుధవారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. సంఘం బాధ్యులు తోట కృష్ణవేణి, లక్ష్మీతులసి, మల్లిక, కళావతి పాల్గొన్నారు. అయ్యప్ప క్షేత్రంలో జ్ఞానసరస్వతి రూపంలో అమ్మవారిని అలంకరించారు. ఏన్కూరు మండలం టీఎల్‌పేట రామాలయం వద్ద బతుకమ్మ ఉత్సవాలకు మహిళలు పెద్దసంఖ్యలో తరలివస్తున్నారు. ముదిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బతుకమ్మ సంబరాలు బుధవారం నిర్వహించారు. వైద్యాధికారిణి డాక్టర్ అరుణాదేవి, సీహెచ్ఓ మధుసూదన్‌రావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు. కల్లూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో అధికారులు బతుకమ్మ సంబరాలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ చంద్రశేఖర్ మాట్లాడారు. మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ బాగం నీరజదేవి, కార్యదర్శి నందిసెట్టి నాగేశ్వరరావు, ఆశాలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు. వేంసూరు మండలం భీమవరం అడసర్లపాడులో జరిగిన బతుకమ్మ వేడుకల్లో ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి పాల్గొన్నారు.



జమలాపురంలో సామూహిక చండీహోమంలో భక్తులు



టీఎల్‌పేట రామాలయం వద్ద బతుకమ్మ సంబరాలు



కల్లూరు పంచాయతీ కార్యాలయంలో...

పూర్వవిద్యార్థుల అపూర్వ కలయిక



కారేపల్లి, న్యూస్‌టుడే: పేరుపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో 2006-2007 పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం ఏర్పాటు చేశారు. అలనాటి విద్యాభ్యాసం, ఉపాధ్యాయుల విద్యాబోధనను గుర్తు చేసుకుంటూ సరదాగా గడిపారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించి, జ్ఞాపికలు అందించారు.

ఇంటిగ్రేటెడ్ పాఠశాల శంకుస్థాపనకు ఏర్పాట్లు

బోనకల్లు, న్యూస్‌టుడే: బోనకల్లు మండలం లక్ష్మీపురంలో ఏర్పాటు చేయనున్న నూతన గురుకుల పాఠశాల భవన నిర్మాణాల శంకుస్థాపన కార్యక్రమాన్ని ర.భ.శాఖ, రెవెన్యూ అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 11న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఈ పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. మంగళవారం ఆ స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్ ముజిమ్మిల్‌ఖాన్ అధికారుల మధ్య సమన్వయ లోపంపై అసహనం వ్యక్తం చేయడంతో బుధవారం ఆగమేఘాల మీద స్థలానికి హద్దులు నిర్ణయించారు.

నిధుల కొరత.. పనులు నత్తనడక

సత్తుపల్లి, న్యూస్‌టుడే

గత ప్రభుత్వం ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలనే సంకల్పంతో మన ఊరు-మన బడి, మన బస్తీ-మన బడి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన తాగునీరు, కరెంటు, మరుగుదొడ్లు, పాఠశాల మరమ్మతులు చేయాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. ఆ దిశగా మండలాల్లో పలు పాఠశాలలను ప్రభుత్వం ఎంపిక చేసి నిధులు మంజూరు చేసింది. ఈక్రమంలో కొన్ని పాఠశాలలలో పనులు పూర్తి కాగా చాలాచోట్ల నిధుల కొరతతో నిర్మాణ పనుల్లో వేగం తగ్గింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పథకాలను రద్దు చేసి అమ్మ ఆదర్శ పాఠశాల పథకంగా నామకరణం చేసి మళ్లీ అభివృద్ధి పనులను ప్రారంభించింది. ప్రతి ఏడాది వేసవి సెలవులు పూర్తయ్యేలోగా పనులను పూర్తి చేయాల్సి ఉండగా నిధుల విడుదలలో జరిగే జాప్యంతో నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. ఈ అంశమై ఎంఈఓ ఎన్.రాజేశ్వరరావు మాట్లాడుతూ త్వరలోనే పనులను పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

☆ స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు మన ఊరు మన బడి ద్వారా అభివృద్ధికి రూ.68 లక్షలు మంజూరు కాగా రూ.30 లక్షలతో పలు నిర్మాణ పనులు చేశారు. చేసిన పనులకు పూర్తిస్థాయిలో బిల్లులు పడకపోవడంతో మరో రూ.38 లక్షల పనులు పెండింగ్‌లో పడ్డాయి.

☆ సిద్ధారం ప్రాథమికోన్నత పాఠశాల అభివృద్ధికి రూ.16 లక్షలు మంజూరు కాగా రూ.4 లక్షలతో పనులు చేశారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల పథకానికి శ్రీకారం చుట్టడంతో మిగిలిన రూ.12 లక్షల పనులు ఈ పథకం ద్వారా కొనసాగిస్తున్నారు.



ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల

నియోజకవర్గంలో వివరాలు...

మండలం	మంజూరైన పాఠశాలలు	పూర్తయినవి	పెండింగ్‌లో ఉన్నవి	అమ్మ ఆదర్శ పాఠశాలలో కలిసినవి
సత్తుపల్లి	22	05	04	13
తల్లాడ	17	13		04
వేంసూరు	47	35		12
పెనుబల్లి	24	03		21
కల్లూరు	21	20	01	
మొత్తం	131	76	05	50

వైభవంగా అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠ



ప్రతిష్ఠ అనంతరం స్వామిని దర్శించుకుంటున్న భక్తులు, మాలధారులు

సత్తుపల్లి, న్యూస్‌టుడే: బుగ్గపాడు విశ్వధర్మ క్షేత్రం ప్రాంగణంలో అన్నపూర్ణ సహిత మోక్ష రుద్రేశ్వరస్వామి ఆలయంలో అయ్యప్ప స్వామి పంచలోహ విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా సాగింది. గాయత్రి ఉపాసకుడు వెల్లటూరి ప్రసాదాచారి పర్యవేక్షణలో ప్రత్యేక హోమం, ప్రతిష్ఠ నిర్వహించారు. ఈ నెల 18న రాత్రి ఆలయంలో తొలి పడిపూజ నిర్వహిస్తున్నట్లు కమిటీ బాధ్యులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బొడ్డు శివబాబు, తుమ్మూరు ప్రసాద్, తుమ్మురు శ్రీనివాసరావు, రవీంద్రబాబు, కిషోర్‌రెడ్డి పాల్గొన్నారు.

కల్లూరు, న్యూస్‌టుడే: కల్లూరు పట్టణ పరిధిలోని మధిరరోడ్డులో అయ్యప్పలకు ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని అఖిల భారత అయ్యప్ప ధర్మ ప్రచార సభ జిల్లా అధ్యక్షులు కాటేపల్లి రజినికాంత్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అఖిల భారత ధర్మ ప్రచార సభ, కల్లూరు అయ్యప్ప భక్త బృందం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని దాతల సహకారంతో నవంబర్ 17వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కల్లూరు మండల అధ్యక్షులు లంకా అప్పలనాయుడు, ఎం.వేణు, కిషోర్, రాంబాబు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు విద్యార్థినుల ఎంపిక



ముదిగొండ, న్యూస్‌టుడే: మెదక్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-17 బాలికలు ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ముదిగొండ మండలం మేడేపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థిని **యువవర్షిణి**, వి.వి.పాలెం జడ్పీహెచ్ పాఠశాల విద్యార్థిని **అనూష** ప్రతిభ చాటారు. వీరు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఆదర్శ, కోచ్ కృష్ణయ్యలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరిని డీఈఓ సోమశేఖరశర్మ, ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు, పీడీ శ్రీనివాస్ అభినందించారు.

ఖమ్మం
• ఖమ్మం • పాలేరు

తపాలా దినోత్సవ ర్యాలీ



ఖమ్మం సారథినగర్, న్యూస్‌టుడే: తపాలా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆ శాఖ ఉద్యోగులు బుధవారం, నగరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రధాన తపాలా కార్యాలయం వద్ద డివిజన్ అధికారి వీరభద్రస్వామి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉద్యోగులు అందరూ ర్యాలీగా బయలుదేరి నగరంలో పొదుపు పథకాలపై అవగాహన కల్పించారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

కూసుమంచి, న్యూస్‌టుడే: కొద్ది రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని జలవనరుల శాఖ సీఈ విద్యాసాగర్ ఇంజినీర్లకు సూచించారు. పాలేరు జలాశయం వద్ద సాగర్ ఎడమ కాల్వ యూటీ తొలగించిన ప్రాంతాన్ని సీఈ బుధవారం సందర్శించారు. ఈ ప్రాంతంలో ధ్వంసమైన యూటీ పునర్నిర్మాణం చేపట్టకుండా కాల్వ ప్రాంతంలో చేరే వర్షం నీటిని భారీ మోటార్ల సాయంతో కాల్వలోకి మళ్లిస్తున్న విషయం తెలిసిందే. ఈ ప్రాంతాన్ని సీఈ సందర్శించి ఈఈ మంగళంపూడి వెంకటేశ్వర్లు, ఇతర ఇంజినీర్లకు సూచనలిచ్చారు. నీటిని నిరంతరం తొలగిస్తుండాలని, అవసరమైతే మరిన్ని మోటార్లు ఏర్పాటు చేయాలని సూచించారు.



యూటీ ప్రాంతాన్ని సందర్శించి సూచనలిస్తున్న సీఈ విద్యాసాగర్



మురుగు కదలదు.. చెత్త తొలగదు!



నగరంలోని రాపర్తినగర్ విద్యానగర్ కాలనీ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పరిస్థితి దయనీయంగా మారింది. కాలువలు ఉన్నా మురుగు ప్రవహించకపోవడం, అదే ప్రాంతంలో ఉన్న ఖాళీ స్థలాల్లో ఇతర ప్రాంతాల నుంచి తెచ్చిన చెత్త వేయడంతో అక్కడి వారి పరిస్థితి దయనీయంగా మారింది. కాలువల్లో మురుగు ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని, చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. – ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే

ప్రకృతి వనంలో వికృత చేష్టలు

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే

పట్టించుకోని అధికార గణం



మూగజీవాలను కోస్తున్న వ్యక్తి

ఖమ్మం నగర పాలకంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వనాల ఉద్దేశం నీరుగారిపోతోంది.. అవన్నీ నిర్దేశించిన కార్యక్రమాలకు బదులుగా ఇతర అవసరాలకు వినియోగించడంతో నడకదారులు, వ్యాయామం చేసేందుకు వచ్చే మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీరి బాధలు పట్టించుకునే దిక్కులేకుండా పోయింది. విజయనగర్ కాలనీ వైపు ఉన్న ప్రకృతి వనంలో మాంసాహారం అమ్మకాలకు అవసరమైన జీవాలను కోయడం, ఆ ప్రాంతంలో శుభ, అశుభ కార్యక్రమాలకు వంటశాలగా ప్రకృతి వనాన్ని వినియోగించడంతో నడకదారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై వారితో మాట్లాడేందుకు యత్నిస్తే తిరగబడతారన్న భయంతో మిన్నకుండిపోతున్నారు. నెల రోజులుగా ఈ తతంగం జరుగుతున్నా నగరపాలక సంస్థ అధికారులెవ్వరూ ఆ వైపు కన్నెత్తి చూడకపోవడం విశేషం. ఇదే అదునుగా కొంతమంది మద్యం ప్రియులు అక్కడే తాగడంతో ఆ ప్రాంతమంతా సీసాలతో నిండిపోయిందని సందర్శకులు వాపోతున్నారు. ఈ విషయమై మేయర్ పునుకొల్లు నీరజను 'న్యూస్‌టుడే' సంప్రదించగా ఇప్పటికే ఈ విషయం తన దృష్టికి వచ్చిందని, ఇకముందు అలాంటి పనులు చేపట్టకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

సర్వజనాసుపత్రి కార్మికుల సమ్మె విరమణ

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: అపరిష్కృత వేతనాల విడుదల కోసం సమ్మె చేస్తున్న ఖమ్మం సర్వజనాసుపత్రి కార్మికులు ఆందోళన విరమించారు. బుధవారం మూడోరోజు ఉదయం నిరసన కార్యక్రమాలను కొనసాగించారు. దీంతో ఆస్పత్రిలో పేషెంట్ కేర్, భద్రత, పారిశుద్ధ్య విభాగాల్లో పనులు పూర్తిగా నిలిచిపోయి అధ్వాన పరిస్థితి నెలకొంది. ఉదయం అధికారులు కార్మికులతో జరిపిన చర్చలు ఫలించకపోవడంతో ఆస్పత్రిని శుభ్రపరిచేందుకు నగర పాలక సంస్థ నుంచి సిబ్బందిని పిలిపించారు. దీంతో ఆస్పత్రి కార్మికులు వారిని పనులు నిర్వహించకుండా అడ్డుకున్నారు. దీంతో ఓ దశలో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. మేము మీలాంటి కార్మికులమే మాకు అన్యాయం చేయవద్దంటూ ఆస్పత్రి కార్మికులు వారిని వేడుకున్నారు. దీంతో నగరపాలక సిబ్బంది వెనుదిరగడంతో పారిశుద్ధ్య పనులు కొనసాగలేదు. ఆ తర్వాత మధ్యాహ్నం మరోసారి అధికారులు, కార్మికులతో చర్చలు జరిపారు. ప్రస్తుతం ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున అడ్వాన్స్‌గా చెల్లిస్తామని.. ప్రభుత్వం నిధులు విడుదల చేయగానే పూర్తి వేతనాలు ఇస్తామని చెప్పడంతో వారు శాంతించారు. అనంతరం సిబ్బంది విధులకు హాజరయ్యారు.



మున్సిపల్ కార్మికులను అడ్డుకుంటున్న ఆసుపత్రి సిబ్బంది

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి: తుమ్మల



రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: నగరపాలకంలో సీసీ రహదారుల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మం కార్పొరేషన్‌లోని 20వ డివిజన్‌లో బుధవారం రూ.50 లక్షలతో చేపట్టనున్న సీసీ రహదారి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు గ్రీనరీకి అధిక ప్రాధాన్యం కల్పిస్తున్నామని చెప్పారు. నూతనంగా రోడ్లను నిర్మించే ప్రాంతాల్లో మొక్కలు నాటి సుందరంగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య, కార్పొరేటర్ బిక్కసాని ప్రశాంతిలక్ష్మి, కమర్తపు మురళీ, నాయకులు గుత్తా వెంకటేశ్వరరావు, బెల్లంకొండ వాసు, ఆళ్ల అంజిరెడ్డి, పాలెపు వెంకటరమణ, కోటేశ్వరరావు,నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విప్లవ దిక్సూచి చేగువేరా

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: విప్లవానికి దిక్సూచి చేగువేరా అని ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శులు నానబాల రామకృష్ణ, ఇటికాల రామకృష్ణ కొనియాడారు. ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితుల ఆధ్వర్యంలో బుధవారం చేగువేరా 57వ వర్ధంతి సభ నిర్వహించారు. ఏఐవైఎఫ్ జిల్లా మాజీ నాయకులు మేకల శ్రీనివాసరావు, జ్వాల నర్సింహారావు, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు శ్రవణ్, శివ, కౌశిక్, పవన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

'భాజపా విధానాలకు వ్యతిరేకంగా పోరాటం'

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: భాజపా సర్కారు విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వై.విక్రమ్ పిలుపునిచ్చారు. ఖమ్మం కూరగాయల మార్కెట్ రిక్షా కార్మికుల యూనియన్ మహాసభ బుధవారం నగరంలోని బైపాస్‌రోడ్డు కూరగాయల మార్కెట్‌లో నిర్వహించారు. సీపీఎం రెండో పట్టణ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, నాయకులు ఉపేందర్, బీరప్ప, స్వామి, ప్రభాకర్, నర్సయ్య, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటిస్తూ విక్రయాలు చేయండి

కూసుమంచి, న్యూస్‌టుడే: నిబంధనలను అనుసరించి విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల విక్రయాలు చేయాలని కూసుమంచి ఏడీఏ సరిత వ్యాపారులకు సూచించారు. నేలకొండపల్లిలో బుధవారం జరిగిన వ్యాపారుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గరిష్ఠ చిల్లర ధర మించినా, నిబంధనలకు విరుద్ధంగా విక్రయించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏవో అరుణకుమారి, డీలర్లు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శిగా బాలాజీ

కామేపల్లి, న్యూస్‌టుడే: పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శిగా కామేపల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు లకావత్ బాలాజీ నియామకమయ్యారు. హైదరాబాద్‌లో నిర్వహించిన 35వ కౌన్సిల్ సమావేశంలో బుధవారం ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



యువవర్షిణి, అనూషలను అభినందిస్తున్న కార్యదర్శి కృష్ణయ్య తదితరులు

రఘునాథపాలెం, న్యూస్‌టుడే: జాతీయ స్థాయిలో జరుగనున్న అండర్-17 బాలికల ఫుట్‌బాల్ క్రీడా పోటీలకు జిల్లాకు చెందిన ఎం.యువవర్షిణి, అనూష ఎంపికయ్యారని జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి బియ్యాని కృష్ణయ్య తెలిపారు. మూడు రోజులుగా మెదక్ స్టేడియంలో జరిగిన తెలంగాణ రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో మేడేపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎం.యువవర్షిణి, వి.వెంకటాయపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థిని అనూష అత్యంత ప్రతిభ కనబరిచారన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ, ప్రధానోపాధ్యాయుడు బండి నాగేశ్వరరావు, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ మూర్తి తదితరులు అభినందించారు.

'ప్రత్యేక విద్యా ఉపాధ్యాయుల నియామకం చేపట్టాలి'

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ప్రత్యేక విద్య ఉపాధ్యాయుల నియామకం వెంటనే చేపట్టాలని స్టేట్ టీచర్స్ ఫెడరేషన్(ఎస్‌టీఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరకొండ సైదులు డిమాండ్ చేశారు. ఖమ్మంలోని జిల్లా కార్యాలయంలో పలువురు ప్రత్యేక విద్య అభ్యర్థులు సైదులును కలిసి వినతి పత్రం అందజేశారు.

పండితాపురం సంతలో సందడి



కామేపల్లి, న్యూస్‌టుడే: పండితాపురం శ్రీ కృష్ణా ప్రసాద్ పశువుల సంత క్రయవిక్రయదారులతో బుధవారం సందడిగా మారింది. దసరా పండగ నేపథ్యంలో జీవాలను కొనుగోలు చేసేందుకు పెద్ద సంఖ్యలో విక్రయదారులు తరలివచ్చారు.

ఇందిరమ్మ రాజ్యంలో హామీల అమలుకు చర్యలు



లబ్ధిదారులకు చెక్కు అందిస్తున్న ఎంపీ రఘురాంరెడ్డి, చిత్రంలో పొంగులేటి, బాలసాని

కూసుమంచి, న్యూస్‌టుడే: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఇందిరమ్మ రాజ్యంలో అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. సత్యనారాయణపురంలోని ఓ కల్యాణ మండపంలో వివిధ గ్రామాల లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డితో కలిసి బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. నీటి పారుదల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ మువ్వా విజయ్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ నాయకురాలు స్వర్ణకుమారి, ఖమ్మం ఆర్డీవో గణేశ్, తహసీల్దార్ రాంప్రసాద్ పాల్గొన్నారు.

ఖాళీ స్థలాల్లో నీటిని తొలగించకుంటే జరిమానా

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ పరిధిలో ఖాళీ స్థలాల యజమానులపై కమిషనర్ అభిషేక్ అగస్త్య చర్యలకు ఉపక్రమించారు. ప్రతి గురువారం ప్రతి డివిజన్ రెండు స్థలాలను ఎంపిక చేసుకొని అక్కడ నిల్వ ఉన్న నీటి తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. పారిశుద్ధ్య సిబ్బందితో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో తొలుత స్థల యజమానులకు నోటీసులు ఇవ్వాలని, శుభ్రం చేసుకోకపోతే రూ.5 వేల జరిమానా విధించాలని, నోటీసులకు స్పందించకపోతే తెలంగాణ పురపాలక చట్టం 2019 ప్రకారం స్థల యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఖర్చును యజమానుల నుంచి వసూలు చేయాలని ఆదేశించారు. సమావేశంలో సహాయ కమిషనర్ సంపత్‌కుమార్, ఇతర పారిశుద్ధ్య పర్యవేక్షకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వితరణలు



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న కిరణ్‌కుమార్, సంస్థ ప్రతినిధులు

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: మున్నేరు వరద బాధితులకు వివిధ సంస్థల వితరణలు కొనసాగుతున్నాయి. బుధవారం నెస్లే ఇండియా లిమిటెడ్ సంస్థ కరుణగిరి ప్రాంత బాధితులకు నిత్యావసర వస్తువులు అందించారు. కార్యక్రమంలో జిల్లా గెజిటెడ్ ఆహార తనిఖీ అధికారి కిరణ్‌కుమార్, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

భగీరథ కార్మికుల విధులు బహిష్కరణ



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

కూసుమంచి, న్యూస్‌టుడే: పాలేరు జలాశయం నుంచి కూసుమంచి మండలంలోని వివిధ గ్రామాలకు రక్షిత తాగు నీరందించే మిషన్ భగీరథ పథకం కార్మికులు బుధవారం నుంచి విధులు బహిష్కరించారు. మూడు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదంటూ కార్మికులు ఆరోపిస్తూ.. విధులు బహిష్కరించి పాలేరు పథకం వద్ద నిరసన వ్యక్తం చేశారు. పాలేరు రక్షిత తాగునీటి పథకం, కూసుమంచి(గుట్ట) పథకాల నిర్వహణలో 48 మంది కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు.

ద్విచక్ర వాహన మెకానిక్‌కు ఆర్థిక సాయం

ఖమ్మం అర్బన్, న్యూస్‌టుడే: నగరానికి చెందిన ద్విచక్రవాహన మెకానిక్ ఆడెపు జాని వెన్నెముక శస్త్ర చికిత్స చేయించుకున్నారు. ఖమ్మం ద్విచక్ర వాహన మెకానిక్‌ల సంఘం ఆధ్వర్యంలో బుధవారం అధ్యక్షుడు వంగాల కొండలరావు రూ.25 వేల చెక్కును వితరణగా అందజేశారు.

దాడి చేశారంటూ విశ్రాంత ఎస్సై ఫిర్యాదు

ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే: తాను మధ్యవర్తిగా ఉండి బంధువులకు అప్పుగా ఇప్పించిన డబ్బు చెల్లించే విషయమై తమ దంపతుల మధ్య వాగ్వాదం జరిగిందని, దీంతో తనపై బంధువులు దాడి చేశారంటూ విశ్రాంత ఎస్ఐ పోలీసులను ఆశ్రయించిన సంఘటన ఖమ్మం నగరం శ్రీనగర్ కాలనీలో బుధవారం సాయంత్రం జరిగింది. బాధితుని కథనం ప్రకారం... స్థానికంగా నివసించే పి.రామయ్య పోలీసుశాఖలో ఎస్సైగా ఇటీవలే పదవీ విరమణ చేశారు. గతంలో ఆయన తన బావమరుదులు, బంధువులకు మధ్యవర్తిగా ఉండి అప్పు ఇప్పించారు. వారు చెల్లించకపోవడంతో రుణదాతల నుంచి రామయ్య ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై తన భార్యతో ఆయన బుధవారం ఘర్షణ పడ్డారు. దీనిపై ఆగ్రహించిన తనికెళ్లకు చెందిన తన బావమరిది శ్రీనివాసరావు, అతని సోదరుని కుమారులు రాజేశ్, రవివర్మ తమ అనుచరులతో వచ్చి రామయ్యపై దాడి చేశారు. అప్పు తీర్చకపోగా, తనను చంపేందుకు ప్రయత్నించారని రామయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఖానాపురం హవేలి ఇన్‌స్పెక్టర్ భానుప్రకాశ్‌ని సంప్రదించగా తమకు ఫిర్యాదు అందిందని, విచారణ జరుపుతామన్నారు.

బాలికలకు ప్రతిభ పురస్కారాలు



బాలికలతో కె.వి.సుబ్బయ్య, సైదేశ్వరరావు

ఖమ్మం గాంధీచౌక్, న్యూస్‌టుడే: ప్రతిభ కనబరిచిన బాలికలకు సిటిజన్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ఖమ్మం శాఖ బాలాజీనగర్ ఆధ్వర్యంలో ప్రతిభ పురస్కారాలు అందజేశారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో 95 శాతం మార్కులు సాధించిన షేర్ హోల్డర్స్ పిల్లలకు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కె.వి.సుబ్బయ్య వీటిని అందజేశారు. 2023-24కు ఖమ్మంలో 208 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల నగదు, ప్రశంస పత్రం అందజేసినట్లు చెప్పారు. బ్రాంచి మేనేజర్ కె.సైదేశ్వరరావు, రిలేషన్‌షిప్ మేనేజర్ జి.సాయిబాబు పాల్గొన్నారు.



ఖమ్మం: సీపీఐ ఆధ్వర్యంలో కొత్తగూడెంలో కోలాట నృత్యాలు



ప్రశాంతినగర్‌లో సరస్వతీ పూజ చేస్తున్న విద్యార్థులు



మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఆశీర్వచనం అందిస్తున్న అర్చకులు

సరస్వతీ నమస్తుభ్యం



పశు సంవర్ధకశాఖ కార్యాలయంలో బతుకమ్మ వేడుకలు



కామేపల్లి: ఎమ్మెల్యే కోరం కనకయ్య పూజలు

ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు సరస్వతీదేవీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్తంభాద్రి లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం, జమ్మిబండ(పారువేట స్థలం) వేదిక, శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో అమ్మవారు సరస్వతీ దేవీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రశాంతినగర్‌లో కార్పొరేటర్ నాగండ్ల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం రాత్రి సరస్వతీ పూజ నిర్వహించారు.

దర్శించుకున్న తుమ్మల: గుట్టలబజారులోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో వాసవీ మాతను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం దర్శించుకున్నారు. ఆలయ అధ్యక్షుడు మేళ్లచెర్వు వెంకటేశ్వరరావు శాలువా కప్పి సత్కరించారు.

ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే: పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో జిల్లా కార్యాలయంలో మహిళా ఉద్యోగులు బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. జిల్లా పశు సంవర్ధకశాఖ జేడీ బి.వేణుమనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరంలోని పలు ప్రాంతాల్లో బుధవారం అన్నదానాలు నిర్వహించగా, సరస్వతిదేవి ఆలయంలో అమ్మవారి పుట్టినరోజును పురస్కరించుకొని అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్ వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

కామేపల్లి, న్యూస్‌టుడే: గోవింద్రాల బంజారలో అమ్మవారికి ఎమ్మెల్యే కోరం కనకయ్య పూజలు చేశారు. భక్తులు పాల్గొన్నారు.